# ఎ ట్రిక్ ఆఫ్ మైండ్

## – వర్ష

## 'యువ మేధవి - తుషార్ కరోనా'

'ఈసారి జరిగిన ఐ.ఎ.ఎస్. పరీక్షలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తుషార్ కరోనా అఖిల భారత స్థాయిలో, జనరల్ లిస్ట్‌లో మొదటి రాంక్‌ను సాధించడం చెప్పుకోదగ్గ విశేషం.

డిగ్రీలోనూ, పి.జి.లోనూ వరుసగా గోల్డ్ మెడల్స్ సాధించిన తుషార్ కరోనా ఓ మంచి ఆర్టిస్ట్ కూడా. ఇతడు వేసిన చిత్రాలలో కొన్ని అఖిల భారత స్థాయిలో ఢిల్లీలో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో చోటుచేసుకున్నాయి. కాగా, తుషార్ కరోనా ఎవ్వరికీ ఇంటర్వ్యూ ఇవ్వడానికి ఒప్పుకోవడం లేదు. కనీసం విలేకరులతో మాట్లాడడానికి కూడా ఇష్టపడడం లేదితను. అయినా మా విలేకరులు కాలేజ్ రికార్డ్స్ ద్వారా తుషార్ కరోనాను గురించిన వివరాలు కొన్ని కనుక్కున్నారు. ఇతడి స్వస్థలం చిత్తూరు జిల్లా పలమనేరు. ఎం.పి.సి. గ్రూప్‌తో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పలమనేరు జూనియర్ కాలేజ్‌లో చదివాడు. ఆ తరువాత తిరుపతి ఎస్.వి. జూనియర్ కాలేజ్‌లో రెండవ సంవత్సరం పూర్తిచేశాక ఎస్.వి. యూనివర్సిటీలో డిగ్రీ మరియు పి.జి. చేశాడు. 'కరోనా' అంటే 'కిరీటం' అని అర్థం. అఖిల భారత స్థాయిలో మొదటి రాంక్‌ను సాధించిన తుషార్ కరోనా నేటి విద్యార్థిలోకానికి నిజంగా కిరీటం అనే చెప్పుకోవాలి.'

'అరె ఇతణ్ణెక్కడో చూసినట్టుందే?' వార్తతో పాటు ప్రచురించిన తుషార్ కరోనా ఫోటోను చూస్తూ ఆలోచిస్తోంది మంజీర. 'ఈ పోలికలు తనకు బాగా పరిచయం ఉన్నట్టే గుర్తు. బహుశ పలమనేరులో ఉన్నప్పుడే చూశానేమో. ఎవరై ఉంటాడితను?' జాగ్రత్తగా ఆలోచించసాగింది.

ఎంతసేపటికీ గుర్తురాకపోవడంతో పేపర్ మడిచేస్తూ అంది — "అంకుల్ తుషార్ కరోనాతో జరిపిన ఇంటర్వ్యూతో మన మాగజైన్ రిలీజ్ అవుతుందని మనం ముందుగా అడ్వర్టైజ్ ఇచ్చేశాం. ఇప్పుడేమో ఇతడు కనీసం విలేకరులతో మాట్లాడడానికి కూడా ఇష్టపడడం లేదని తెలుస్తోంది. మనం అనవసరంగా తొందరపడ్డామేమో."

"నో... నువ్వతని వద్ద ఇంటర్వ్యూ తీసుకొని రాగలవన్న నమ్మకం నాకుంది. అందుకే ఈ పనిని నీ కప్పగించాను. మన మాగజైన్ రిలీజ్ కావడానికి ఇక సరిగా నాలుగురోజుల టైం మాత్రమే ఉంది. తుషార్ కరోనాతో జరిపిన ఇంటర్వ్యూ ప్రచురించడం వల్ల మన పత్రిక సర్క్యులేషన్ మరింత పెరిగే అవకాశం ఉంది. ఆలోచించుకో. మన పత్రిక పరువుప్రతిష్ఠలు నిలిపే బాధ్యత నీది" సాలోచనగా అన్నాడు పాంచజన్య విజ్ఞాన వాహిని పత్రిక ఎడిటర్.

కొద్ది క్షణాలు ఆలోచించాక "ఒ.కె. అంకుల్. ట్రైచేస్తాను" అంటూ లేచి నిలబడింది మంజీర. "విష్ యూ ఆల్ ది బెస్ట్" అన్నాడు పాంచజన్య.

"థాంక్యూ అంకుల్" అనేసి బయటకు నడిచింది మంజీర.

విజ్ఞాన వాహిని పత్రికాఫీసులో జర్నలిస్టుగా పని చేస్తోంది మంజీర. కేవలం జర్నలిస్టుగానే కాక ఎడిటర్‌గారి పర్సనల్ అసిస్టెంట్‌గా ఆఫీస్‌కు సంబంధించిన అన్ని విషయాలు తనే చూసుకుంటుంటుంది. ఎడిటర్ పాంచజన్యకు మంజీరపైన అపారమైన నమ్మకం. పత్రికకు సంబంధించిన అన్ని విషయాలలోనూ మంజీరను సంప్రదిస్తుంటాడు. మంజీర కృషి వల్లే తన పత్రిక సర్క్యులేషన్ పెరిగిందని అతడి గట్టి నమ్మకం. ఆ కారణంతోనే మంజీరను ఆఫీస్‌లో ఉద్యోగిగా కాకుండా తన కూతురిలా చూసుకుంటాడు. మంజీర కూడా అతణ్ణి 'అంకుల్' అని సంబోధిస్తుంటుంది."

సాయంత్రం 4-30 కావస్తోంది. తను వేసిన పెయింటింగ్‌కు తుదిమెరుగులు దిద్దుతూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు తుషార్ కరోనా.

"అయ్యగారూ మీ కోసం ఎవరో వచ్చారండి. ఇంటర్వ్యూ జరపాలట" అన్న పనిమనిషి రంగయ్య పిలుపుకు తుళ్ళిపడ్డాడు.

"ఇంటర్వ్యూ ఎవ్వరికీ ఇవ్వనని చెప్పు" అనేసి వెళ్ళి పెయింటింగ్ కేసి చూడసాగాడు. కాస్సేపటికి — "మీతో మాట్లాడాలంటున్నారయ్యాగారూ" అన్న రంగయ్య పిలుపుకు తిరిగి చూశాడు. ఒక్క క్షణం ఆగి "నువ్వెళ్ళి నీ పని చూసుకో" అన్నాడు విసుగ్గా. మారుమాట్లాడకుండా వెళ్ళిపోయాడు రంగయ్య.

'ఛ... ఈ జర్నలిస్టులకు వేళాపాళా ఉండదు. ఎప్పుడంటే అప్పుడు డిస్టర్బ్ చెయ్యడమే. ఈసారి గట్టిగా చెప్పెయ్యాలి' మనసులోనే విసుక్కుంటూ హాల్లోకి అడుగుపెట్టిన తుషార్ ఒక్క క్షణం విస్తుపోయాడు.

'మంజీర' అస్పష్టంగా పలికాయతడి పెదవులు. ఒక్కసారిగా గుండె వేగం హెచ్చింది. ఏడేళ్ళ తరువాత మొట్టమొదటిసారిగా స్పందించిందతని హృదయం.

"నమస్కారమండీ" అంటూ లేచి నిలబడింది మంజీర. వెంటనే తేరుకొని సీరియస్ అయిపోయాడు. "నమస్తే. కూర్చోండి" అంటూ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాడు. 'ఓహ్... మంజీరా. ఆఖరుకి నువ్వే నన్ను గుర్తుపట్టలేనంతగా మారిపోయాన్నేను' మనసులోనే అనుకుంటూ మంజీరవైపు ప్రశ్నార్థకంగా చూశాడు. తనను తాను పరిచయం చేసుకుంటూ అంది మంజీర "ఐ యామ్ మంజీర. 'విజ్ఞాన వాహిని' పత్రిక తరఫున వచ్చిన జర్నలిస్టుని. మా పత్రికలో ముఖ్యంగా జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి ఎక్కువగా స్టూడెంట్స్‌కు ఉపయోగపడే ఆర్టికల్స్‌నే పబ్లిష్ చేస్తుంటాం. యువ మేధావి తుషార్ కరోనాతో జరిపిన ఇంటర్వ్యూతో మా పత్రిక రిలీజ్ అవుతుందని ముందుగా మేం అడ్వర్టైజ్‌మెంట్స్ ఇచ్చేశాం. కనుక మీరు దయచేసి..."

మాటల్ని మధ్యలోనే కట్ చేస్తూ అన్నాడు తుషార్ "నేను ఎవ్వరికీ ఇంటర్వ్యూ ఇవ్వడంలేదని తెలిసే మీరు అడ్వర్టైజ్‌మెంట్స్ ఇచ్చారు. అంటే అందుకు ఐ కాంట్ హెల్ప్ యూ."

నిస్సహాయంగా అతడి వైపు చూసింది మంజీర. కొద్ది క్షణాలు నిశ్శబ్దం ఆవరించుకుందా హాల్లో. కాస్సేపటికి నిశ్శబ్దాన్ని చీల్చుతూ అంది మంజీర



ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 29-11-91

— "పోనీ, ఇంటర్వ్యూ ఇవ్వకపోవడానికి గల కారణమేమిటో అదైనా తెలుసుకోవచ్చా?"

"ఆ ప్రశ్న మీరు ఓ జర్నలిస్టుగా కాక పర్స నల్‌గా అడిగితే జవాబు చెప్పడానికి నాకేం అభ్యంతరం లేదు."

ఆశ్చర్యపోతూనే "చెప్పండి" అంది మంజీర ఉత్సాహంగా.

లేచి కిటికీ దగ్గరికెళ్ళి నిలబడ్డాడు తుషార్. కిటికీలోంచి బయటకు చూస్తూ అన్నాడు "మంజీరా! ముందు నేనో ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్పగలవా?" ఏకవచన ప్రయోగానికి కాస్త కోపం వచ్చినా తమాయించుకుంది మంజీర. "ఏమిటి? ఇతడి వింత ధోరణి?" అనుకుంటూనే "అడగండి. నాకు చేతనైనంత వరకు జవాబు చెప్పగలను" అంది.

"నాతో ఇంటర్వ్యూ జరపడం వల్ల ప్రయోజనం ఏమిటి?" సూటిగా తననే చూస్తూ ప్రశ్నించడంతో చూపులు మరల్చుకుంది మంజీర.

"ఏముంది. మీలాంటి మేధావులతో ఇంటర్వ్యూ జరపడం వల్ల పాఠకులకు చాలా విషయాలు తెలుస్తాయి. ముఖ్యంగా స్టూడెంట్స్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలి? గైడెన్స్ కోసం ఏయే బుక్స్ ఫాలో అవ్వాలి? అన్న విషయాలు తెలుస్తాయి. తద్వారా వాళ్ళు మరిన్ని మార్క్స్ స్కోర్ చేసే అవకాశం వుంది. అఫ్‌కోర్స్ మీలాంటి జీనియస్‌లతో ఇంటర్వ్యూ జరపడం వల్ల మా పత్రిక సర్క్యులేషన్ పెరిగే అవకాశం ఉందనుకోండి."

"అంటే? నేను జీనియస్‌ననా మీ ఉద్దేశం?" నొక్కి ప్రశ్నించాడు తుషార్.

"కాదని ఎవరన్నారు? అఖిల భారత స్థాయిలో మొదటి రాంక్‌ను సాధించడమే కాకుండా మంచి ఆర్టిస్ట్ కూడా అయిన మీరు జీనియస్ అని నేనే కాదు ప్రతిఒక్కరూ ఒప్పుకుంటారు."



"ఓ.కె. మీ దృష్టిలో నేను జీనియస్‌నే. ఒప్పుకుంటాను. కానీ ఇందాక మీరన్నారే నాతో జరిపిన ఇంటర్వ్యూ వల్ల స్టూడెంట్స్ మరిన్ని మార్కులు స్కోర్ చెయ్యగలుగుతారని. అందుకు మాత్రం నేనొప్పుకోను. ఎందుకంటారా? మీరంటున్న జీనియస్ అన్న ఈ స్థాయికి ఎదగడానికి నేను ఎవరి సలహాలు తీసుకోలేదు కాబట్టి. ఏ సీనియర్స్‌నూ ఫాలో అవలేదు కాబట్టి. నా స్వయంకృషి, పట్టుదల, జీనియస్ అనిపించుకోవాలన్న తపనే నన్నీస్థితికి తెచ్చాయి. వ్యక్తి స్వయంగా ఆలోచించి, తన జీవితానికనుగుణంగా తాను ఏర్పరచుకున్న మార్గం ద్వారానే గమ్యాన్ని అవలీలగా చేరుకోగలడని అనుభవం ద్వారా తెలుసుకున్న నేను 'మీరు ఇలా చెయ్యండి. ఈ మార్గంలో పయనిస్తే గమ్యాన్ని చేరుకోగలరు' అని మరొకరికి చెప్పాలనుకోవడం వాళ్ళను మభ్యపెట్టినట్టు కాదా?"

ఒక్క క్షణం ఆగి "మంజీరా! నువ్వు పలమనేరు జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ చదివావు కదూ" అన్నాడు. ఆశ్చర్యపోయింది మంజీర. "మీ కెలా తెలుసు?"

"నువ్వు ఇంటర్ చదువుతున్నప్పుడు నీ క్లాస్‌మేట్, ప్రిన్సిపాల్ ప్రేమ్ కరోనాగారి కొడుకు తుషార్ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు గుర్తుందా?"

"తుషార్? నువ్వా?" ఆశ్చర్యం నుంచీ తేరుకుంటూ అంది మంజీర.

"అవును మంజీరా. నేనే. తుషార్‌ని. ఆ రోజు నువ్వు ఎవరో చేసిన పనికి నన్ను అందరి దృష్టిలో ఫూల్ కింద జమకట్టినప్పుడు 'ఏదో ఒక రోజు నీచేతే జీనియస్ ననిపించుకుంటా'నని ఛాలెంజ్ చేశాను గుర్తుందా? ఈ రోజు నీ చేత జీనియస్ అనిపించుకున్నాను. మంజీరా! ఈ ఏడేళ్ళలో గోల్డ్ మెడల్స్ సాధించిన రోజు నేను సంతోషించలేదు. నా పెయింటింగ్స్‌కు ప్రైజెస్ వచ్చిన రోజూ నేను సంతోషించలేదు. ఆఖరుకి ఐ.ఎ.ఎస్.లో ఫస్ట్ రాంక్ సాధించిన రోజు కూడా నేను ఏ మాత్రం సంతోషించలేదు. ఒకటే తపన నీ చేత జీనియస్ ననిపించుకోవాలని. ఆ తపనతోనే ఇన్నాళ్ళూ పట్టుదలతో కృషి చేశాను. మంజీరా ఈ రోజు నా కెంత సంతోషంగా వుందో తెలుసా?" ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు తుషార్.

"సారీ తుషార్. నిన్ను గుర్తుపట్టలేకపోయాను" నొచ్చుకుంటూ అంది మంజీర.

"నో మాటర్. నువ్వే కాదు మన క్లాస్‌మేట్స్ ఎవ్వరూ గుర్తుపట్టలేనంతగా మారిపోయాన్నేను. ఒక్క మాటతో నా జీవితాన్నే మలుపు తిప్పి నన్నో మేధావిగా మార్చావు. మంజీరా హౌ కెన్ అయ్ ఎక్స్‌ప్రెస్ మై గ్రాటిట్యూడ్? నవ్వుతూ అన్నాడు "ఇక మీ పత్రికలో నాతో జరిపిన ఇంటర్వ్యూ గురించి ఏమని పబ్లిష్ చేస్తావో నీ ఇష్టం. ఐ హావ్‌న్ట్ ఎనీ అబ్జెక్షన్"

మాట్లాడడానికి మాటలు కరువయ్యాయో, లేక ఉప్పొంగుతున్న ఉద్వేగం చేతనో కొన్ని క్షణాలు మౌనంగా వుండి పోయారిద్దరూ. కాస్సేపటికి మంజీర అంది "తుషార్ నువ్వు చెప్పింది నిజమే. ప్రతి వ్యక్తీ తనకు తానుగా ఆలోచించి తనకంటూ ఓ మార్గం ఏర్పరచుకోవాలి. కాదనను. కానీ ఏ వ్యక్తీ మరొకరిపై ఆధారపడకుండా పూర్తిగా తనంతట తానుగా ముందుకి రాలేడు. మానవుడు సంఘ జీవి కాబట్టే సమిష్టిగా ఇంతగా అభివృద్ధిని సాధించ గలిగాడు. పూర్తిగా సీనియర్స్ పైన ఆధారపడడం కాదు. గతాన్ని అధ్యయనం చేస్తూ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటాడు మనిషి. తద్వారా గతంలో సాధించిన పురోభివృద్ధి కంటే మరింత ప్రగతిని సాధించగల్గుతాడు. ప్రతి వ్యక్తీ తెలిసో తెలియకో ఏదో ఒక విషయంలో మరొకరి మీద ఆధారపడక తప్పదు. ఆ మాటకొస్తే నువ్వు చదివిన పుస్తకాలన్నీ నువ్వు రాసినవి కావుగా. అఫ్‌కోర్స్ ఏ ఏ పుస్తకాలు ఫాలో అవ్వాలి? ఎలా చదవాలి? అన్న వివరాలు నువ్వు మీ సీనియర్స్‌ను అడగకపోయి వుండొచ్చు. ఎవరో ముందుతరం వాళ్ళు వ్రాసిన పుస్తకాలను చదివి మనం ఇప్పుడు ఇంతగా ముందుకు వెళ్ళగల్గుతున్నాం. అటువంటప్పుడు మనవల్ల మన జూనియర్స్ మరింత ప్రగతిని సాధించే అవకాశం లేదా? అంతెందుకు? ఆదిమ మానవుడు ఆహార సంపాదన, గృహ నిర్మాణ లాంటి విషయాల్లో పశు పక్ష్యాదులను సైతం అనుకరించినప్పుడు నీకు తెలిసిన విషయాలు మరొకరు తెలిసికోవడంలో తప్పేముంది?" సూటిగా ప్రశ్నించింది మంజీర. మౌనంగా వుండిపోయాడు తుషార్. కాస్సేపటికి "సారీ మంజీరా. ఇన్నాళ్ళు నీ చేత జీనియస్ అన్పించుకోవాలన్న తపనతో మరేమీ ఆలోచించలేకపోయాను. ఐ అగ్రీ విత్ యూ. నిజమే. ఎవరో రాసిన పుస్తకాలను చదివి ఫస్ట్ రాంక్ సాధించిన నేను నాకు తెలిసిన విషయాలు మరొకరికి చెప్పకపోవడంలో అర్థం లేదు." నవ్వుతూ అన్నాడు "అయినా ఇన్నివిషయాలు తెలిసిన నీకు ఫస్ట్ రాంక్ సాధించడానికి ఎలా ప్రిపేర్ అవ్వాలో తెలియంది కాదనుకుంటాను" నవ్వింది మంజీర.

కాస్సేపు ఇంటర్వ్యూలో ప్రచురించాల్సిన విషయాలను గురించి చర్చించుకున్నారిద్దరూ. అదో ఇంటర్వ్యూలా కాకుండా పబ్లిష్ చెయ్యాల్సిన ఆర్టికల్ గురించి స్నేహితుల మధ్య చర్చలా జరిగింది వాళ్ళిద్దరి సంభాషణ. అన్ని వివరాలు చర్చించుకున్నాక "ఓ.కే. థాంక్యూ తుషార్. సీయూ అగైన్" అంటూ లేచి నిలబడింది మంజీర. తుషార్ మనసంతా ఒకటే ఉద్వేగం. కనీసం అప్పుడైనా "ఐ లవ్ యూ మంజీరా" అంటూ తన ప్రేమను వ్యక్తం చెయ్యాలన్న ఆశ. తనను తాను కంట్రోల్ చేసికుంటూ లేచి నిలబడ్డాడు. హాలు దాటి వెళ్ళబోతున్నదల్లా ఒక్క క్షణం వెనక్కు తిరిగి చూసింది మంజీర. తననే చూస్తూ తన వెనకే నిలబడి వున్నాడు తుషార్.

"Love is the only trial of mind to touch the heart" అనేసి వేగంగా వెళ్ళిపోయింది మంజీర. వెళ్ళిపోతున్న మంజీరనే చూస్తున్నాడు తుషార్.

"ఓహ్... మంజీర. రియల్లీ యు ఆర్ ఎ స్ట్రేంజ్ పర్సన్. మనసులోని మాటను వ్యక్తం చెయ్యకముందే కనుక్కొని సమాధానం చెప్పావు. ఐ యామ్ వెరీమచ్ ప్రౌడ్ ఆఫ్ యూ మంజీరా. ఐ లవ్ యూ ఫర్ ఎవర్ అండ్ ఎవర్. అతి సున్నితంగా నా హృదయాన్ని స్పృశించిన నిన్ను సురక్షితంగా గుండెలో దాచుకుంటాను నేస్తం!'. ఊహల

## 'చిల్లర' సలహా

రాంబాబు పొరపాటున పది రూపాయిల నోటు ఓ బావిలో జారవిడిచాడు. దోవనపోయే ఓ దానయ్యని పిలిచి ఆ నోటు తీసిస్తే ఐదు రూపాయలిస్తానన్నాడు. అతను బావిలోకి దిగి పది రూపాయిల నోటు రాంబాబుకు తెచ్చి ఇచ్చాడు. నోటు తీసుకుని రాంబాబు అరె! నా దగ్గర చిల్లర లేదే మీకిచ్చేందుకు అన్నాడు."

"ఫరవాలేదు. మరోసారి నోటు బావిలో పడెయ్యండి మన లెక్క సరిపోతుంది" పేచీ లేకుండా సలహా ఇచ్చాడు దానయ్య.

* * *

"డాక్టర పరాంకుశం హడావుడిగా పరుగెత్తుకు వచ్చి అమ్మాయ్ నా మెడికల్ బ్యాగ్ ఇలా పట్రా అర్జంటుగా వెళ్ళాలి" అనడిగాడు కంగారుగా.

"ఏమిటంత కంగారు నాన్నా?" అనడిగింది కూతురు.

"ఇప్పుడు ఒకతను ఫోన్ చేసి నువ్వు లేనిదే బ్రతకలేనన్నాడు."

"పరేలే వెళ్ళి పడుకోండి. ఆ ఫోన్ కాల్ నా కోసం వచ్చిందయుంటుంది" తాపీగా చెప్పింది డాక్టర్‌గారి పుత్రికారత్నం.

— కాట్రగడ్డ విజయలక్ష్మి

తాలూకు ఉద్వేగంతో వుక్కిరిబిక్కిరవుతున్న తుషార్ మంజీర కనుమరుగవడంతో వాస్తవంలోకి వచ్చాడు. గతం తాలూకు జ్ఞాపకాలు వెన్నాడుతుండగా తన రూంలోకి వెళ్ళాడు. ఒక్కసారిగా అతడికి కాలేజ్ లైఫ్ గుర్తు కొచ్చింది. జ్ఞాపకాల పొరల్ని చీల్చుకుంటూ ఏడేళ్ళు వెనక్కి వెళ్ళిందతడి ఆలోచనా ప్రవంతి.

అప్పుడు తుషార్ పలమనేరు జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ చదువుతున్నప్పటి సంఘటన. ప్రిన్సిపాల్ ప్రేమ్‌కరోనా గారి ఏకైక పుత్రుడు తుషార్. స్వతహాగా అన్ని విషయాలలోనూ చొరవగా ముందుంటూ, అందరితోనూ కలుపుగోలుగా వుండేవాడు. చురుగ్గా వుంటూ అందర్నీ ఆకర్షించే రూపం కావడంతో ఆ కాలేజ్‌లో తనో హీరోలా బిహేవ్ చేస్తుండేవాడు. సెకెండ్ ఇయర్ క్లాసులు ప్రారంభమైన కొన్ని రోజులకు కాలేజ్‌లో ఎలక్షన్స్ అనౌన్స్ చేశారు. స్టూడెంట్స్ అందరూ తుషార్‌ని ఏకగ్రీవంగా ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. మంజీర తన క్లాస్‌మేట్. ఓ బ్రిలియంట్ స్టూడెంట్. ఎప్పుడూ కామ్‌గా వుంటూ ఎవ్వరితోనూ అంతగా మాట్లాడేది కాదు. క్లాస్‌లో మాత్రం లెక్చరర్స్ అడిగే ప్రశ్నలకు అబ్బాయిల కంటే ముందుగా తనే లేచి ఆన్సర్స్ చెప్పేది. అది ఆకర్షణో, ప్రేమో తెలియని స్థితిలో మంజీర మీద అదో ప్రత్యేకమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నాడు తుషార్. ప్రతి రోజు మంజీరను అబ్జర్వ్ చేస్తుండేవాడు. రానురాను మంజీరను చూడకుండా వుండేలేని పరిస్థితి ఏర్పడింది. ఏదో విధంగా ప్రతి రోజూ దూరం నుంచే మంజీరను చూస్తుండేవాడు. అలా చూడడంలో అదో తృప్తి. కానీ మంజీరకు మాత్రం ఈ విషయం తెలీదు. తన ప్రేమను ఎలా వ్యక్తం చెయ్యాలో తెలీని పరిస్థితిలో వున్నాడు తుషార్. ఏదో ఒక రోజు "మంజీరా ఐ లవ్ యూ" అని మంజీరతో చెప్పాలన్న తపన.

ఓ రోజు ఉదయం క్లాస్‌లోకి వెళ్ళగానే బుక్స్ డస్క్‌లో పెట్టేసి అమ్మాయిల డస్క్స్ వైపు చూశాడు. కోపంగా బోర్డ్ వైపు చూస్తోంది మంజీర. బోర్డ్ కేసి చూసిన తుషార్ ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు.

"Manjeera I Love you" అని వ్రాసి వుంది బోర్డ్ మీద. కోపంతో జేవురించిందతడి ముఖం. తనదైన వస్తువును మరెవరో లాక్కుంటున్నప్పుడు కలిగే ఫీలింగ్ అది. వేగంగా వెళ్ళి డస్టర్ తీసుకొని బోర్డ్ వైపు అడుగేశాడు.

"ఆగు" గట్టిగా అరిచింది మంజీర. బోర్డ్ తుడవబోయిన తుషార్ అలాగే ఆగిపోయాడు. బోర్డ్ దగ్గరికొచ్చింది మంజీర. డస్టర్ టేబిల్ మీద పెట్టేసి వెళ్ళి తన సీట్‌లో కూర్చున్నాడు తుషార్.

ఒక్కసారి బోర్డ్‌కేసి చూసింది మంజీర. స్టూడెంట్స్ వైపు తిరిగి అంది. "ఈ వాక్యం రాసిన వారెవరో శుద్ధ పిరికి పందలు కాబట్టే నేను లేనప్పుడు రాశారు దీన్ని. కానీ ఈ వాక్యం చూసి వణికి పోయేటంతటి పిరికి దాన్ని కాను నేను. దీన్నెలా వుపయోగించుకోవాలో నాకు బాగా తెలుసు."

చాక్‌పీస్ తీసుకొని బోర్డ్ మీద ఆ వాక్యం పైన రెండు వాక్యాలు వ్రాసి, ఆ వాక్యానికి కొటేషన్ మార్క్స్ పెట్టి కింద by Manjeera అని వ్రాసింది. పూర్తిగా కలిపి చదివితే ఇలా వుంది.

Love is just a trick of heart to fool the mind. Before loving any others a person tries to fool his heart himself. So a fool only can say like this -

"Manjeera I Love you"

By Manjeera

ఒక్క క్షణం నివ్వెరపోయాడు తుషార్. ఇన్నాళ్ళుగా తను ఎంతో అపురూపంగా పెంచుకున్న భావాన్ని ఒక్కసారిగా నిర్దాక్షిణ్యంగా తుంచేసిన ఫీలింగ్. కోపంగా లేచి అడిగాడు "అంటే నీ ఉద్దేశం. ప్రేమించే వాళ్ళందరూ ఫూల్స్ అనా?"

"ఎవడో పిరికి వెధవను ఉద్దేశించి నేను రాస్తే నీకెందుకంత రోషం?" సూటిగా ప్రశ్నించింది మంజీర. స్టూడెంట్స్ అందరూ తుషార్ కేసి చూశారు. అందరి మనసుల్లోనూ ఒకటే సందేహం. ఆ వాక్యం బోర్డ్ మీద తుషార్ రాశాడేమోనని. అంతవరకూ తుషార్ అంటే అసూయపడుతున్న మరికొందరు మరింత కుతూహలంగా తమాషా చూడసాగారు. "లీడర్స్‌గా వుంటూనే బోర్డ్ మీద రాయకూడనివన్నీ రాస్తారు. మళ్ళీ ఏం ఎరగనట్టు బోర్డ్ తుడవబోతారు" ఒకడన్నాడు అక్కసుగా. ఒక్కసారిగా తుషార్ అహం దెబ్బ తింది. మంజీర వైపు కోపంగా చూస్తూ అన్నాడు.

"ఎవరో చేసిన పనికి ఈ రోజు నన్ను అందరి దృష్టిలో ఫూల్ కింద జమ కట్టావ్. చూస్తూ వుండు ఏదో ఒకరోజు నీ చేతే జీనియస్ అనిపించుకోకపోను. దిసీజ్ మై ఛాలెంజ్" విసురుగా బుక్స్ తీసుకొని వచ్చేశాడు తుషార్. అంతే ఆ రోజు నుండీ మళ్ళీ ఆ కాలేజ్‌లో అడుగుపెట్టలేదు తను. ట్రాన్స్‌ఫర్ పెట్టుకొని తిరుపతికి వచ్చేశాడు. హాస్టల్‌లో వుండి చదివాడిన్నాళ్ళూ.

నాలుగురోజుల తరువాత రిలీజ్ అయిన విజ్ఞాన వాహిని పత్రికలో తుషార్ కరోనాతో జరిపిన ఇంటర్వ్యూలో ఆఖరుగా ఇలా వుంది.

'తుషార్ కరోనా పూర్తిగా స్వయంకృషితో, పట్టుదలతో పైకి వచ్చిన వ్యక్తి. మరొకరి సలహాలు తీసుకోవడం కంటే ఎవరికి వారు తమంతట తాముగా ఆలోచించి పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలి అన్న విషయం గురించి తమకనుగుణంగా తాము ఏర్పరచుకున్న నిర్ణయం ద్వారానే గమ్యం సాధించగలరని వారి గట్టి నమ్మకం. ఆయన తమ' అనుభవం ద్వారా నేర్చుకున్నది కూడా అదే. విద్యార్థులు చరిత్రను అధ్యయనం చేస్తూ మరోవైపు చరిత్రను సృష్టించాలని ఆయన ఆశించారు.

పత్రికలో పబ్లిష్ అయిన ఇంటర్వ్యూను చూస్తూ తుషార్ గురించి ఆలోచిస్తోంది మంజీర. అక్కడ తన రూంలో నాలుగు రోజులు శ్రమపడి చిత్రించిన మంజీర పెయింటింగ్‌కు తుదిమెరుగులు దిద్దుతున్నాడు తుషార్.

